ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 24 డిసెంబరు 2024







తగ్గేదేలే

- పోలీస్‌లకు సవాల్ విసురుతున్న గంజాయి స్మగ్లర్లు
- నిత్యం ఏదో ఒక దారిలో దొంగచాటుగా సరిహద్దులు దాటింపు
- ఎవరి నుంచైనా కచ్చితమైన సమాచారం వస్తేనే పట్టివేత
- సాగుకు దూరంగా ఉండాలని కోరిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

- తెర్లాం మండలం డి.గదబవలస కూడలిలో 18.2 కిలోల గంజాయితో ఉన్న 15 ప్యాకెట్‌లను బానెట్‌లో పెట్టి తరలిస్తున్న రెండు కార్లను పోలీస్‌లు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ మైనర్‌తో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా, హర్యానా రాష్ట్రాలకు చెందిన మరో ముగ్గురు పరారైనట్లు గురవారం రాత్రి బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకర్లకు వివరించారు.
- పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం 8 కేజీల గంజాయితో నలుగురు వ్యక్తులు పోలీస్‌లకు చిక్కారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వీరి బ్యాగులను తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ నుంచి చెన్నైకు దీన్ని తరలించే ప్రయత్నం చేశారు.
- శృంగవరపుకోట మండలం బొడ్డవర చెక్‌పోస్టు వద్ద గురువారం మధ్యాహ్నం 100 కేజీలకు పైబడిన గంజాయిని పట్టుకున్నారు. వాహనంలో ప్రత్యేక అర ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచారు. పోలీస్‌లు తనిఖీలు చేసిన కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఖచ్చితమైన సమాచారంతో వాహనాన్ని పోలీస్‌లు క్షుణ్ణంగా పరిశీలించడంతో తప్పించుకోలేకపోయారు.
- జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో గురువారం ఐదు కిలోల గంజాయితో హరియాణా రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని రైల్వే పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. రాయగడ నుంచి తిరుపతికి గంజాయిను తరలిస్తున్నట్లు విచారణలో తెలింది.

శృంగవరపుకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బుధ, గురువారాల్లో పోలీసులకు చిక్కిన గంజాయి ఘటనలు పరిశీలిస్తే స్మగ్లర్లు ఏమాత్రం తగ్గడం లేదని, ఏదో దారిలో ఎంతో కొంత తరలించుకుని డబ్బు వెనకేసుకునే దురాలోచనలోనే ఉన్నారని తెలుస్తోంది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా.. జిల్లా పోలీసులు నిఘా పెట్టినా ఇంకా జిల్లా మీదుగా గంజాయి తరలుతోందని నిర్ధారణ అవుతోంది. ఎస్పీ వకుల్‌జిందాల్ బాధ్యతలు తీసుకున్న తరువాత గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టారు.

విస్తృత తనిఖీలు



ఎస్.కోట పోలీసుల తనిఖీల్లో బయటపడ్డ గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

చేపడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఖచ్చితమైన సమాచారంతో గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకుంటున్నారు. అయినప్పటికీ గంజాయి రవాణా ఆగడం లేదు. మీరు పట్టుకుంటే.. మేము ఆపే స్టామా అని స్మగ్లర్‌లు పోలీస్‌లకు సవాల్ విసురుతున్నారు. జిల్లాలో ఏదోఒక మార్గంలో సరిహద్దులు దాటించే ప్రయత్నం చేస్తున్నారు. గంజాయి వ్యాపారం సాగిస్తున్న అసలు దొంగలు దొరకకపోవడమే దీనికి కారణం. పోలీస్‌లకు పట్టుబడుతున్న వారంతా గంజాయి స్మగ్లర్ల వద్ద కమీషన్ పద్ధతిపై పనిచేస్తున్నవారే. దీంతో ఒకరు పట్టుబడితే మరొకరికి డబ్బులు ఆశచూపి గంజాయి రవాణాకు వాడుకుంటున్నారు. పోలీస్‌లకు పట్టుబడిన వారిని కూడా గంజాయి స్మగ్లింగ్ ద్వారా సంపాదించిన డబ్బుతో బెయిల్ ఇప్పించి జైలు నుంచి బయటకు తీసుకువస్తున్నారని సమాచారం.

అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆనుకుని వున్న ఒడిశా సరిహద్దుల్లో గంజాయిని విస్తృతంగా పండిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ముఖద్వారంగా విజయనగరం జిల్లా వుంది. ఒడిశా సరిహద్దుల నుంచి అల్లూరి జిల్లాకు వస్తున్న గంజాయిని ఇతర రాష్ట్రాలు, దేశాలకు తరలించాలన్నా జిల్లా మీదుగా రవాణా చేయకతప్పని పరిస్థితి. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల రహదారులనూ స్మగ్లర్‌లు గంజాయి రవాణాకు వాడుకుంటున్నారు. కాగా రాజహంస, శీలావతి, తాళపత్రి రకాల గంజాయి మొక్కలు అక్కడ పెంచుతున్నట్లు సమాచారం. ఈ పంటకు పెట్టుబడి అంతా గంజాయి వ్యాపారులదే. మొక్క నుంచి పంట పండేవరకు అయ్యో ఖర్చుంతా వారే భరిస్తారు. పంట పొలానికి చెందిన రైతుకు కొంత మొత్తం చెల్లిస్తున్నారు. పెట్టుబడి లేకుండా డబ్బులు వస్తుండడంతో చట్టవిరుద్ధమైనప్పటికీ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. రహదారి సదుపాయం సక్రమంగా లేని ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే పోలీస్‌లకు భయమే. ఈ అంశమే గంజాయి స్మగ్లర్‌లకు కలిసోస్తుంది. మరోవైపు రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో రవాణాను కట్టడి చేయాలంటే ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సి వుంది.

చాకచక్యంగా రవాణా..

గంజాయి స్మగ్లింగ్‌ను గత వైసీపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వదిలేసింది. దీంతో యువత (మిగతా 8వ పేజీలో...)

కేసుల వివరాలు ఇలా..

సంవత్సరం	కేసులు	సరుకు స్వాధీనం (కేజీలు)	అరెస్టుయిన వ్యక్తులు
2023	58	2,559.17	105
2024 (ఇంతవరకు)	81	2,152,139	247

టెన్షన్.. టెన్షన్

- రెండు రోజుల పాటు భారీ వర్ష సూచన
- 4 వేల ఎకరాల్లో వరి పంట పరిస్థితి ఏమిటో
- 360 ఎకరాల్లో తడిచిన ధాన్యం



భోగాపురం: పోలిపల్లి సమీపంలో నీటిలోనే వరి పనలు

విజయనగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతుకు మళ్లీ టెన్షన్ పట్టుకుంది. ఒక తుఫాన్ పోయిందనుకుంటే మరో తుఫాన్ వెంటాడుతోంది. రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు సోమవారం హెచ్చరించారు. దీంతో అన్నదాతలు మిగులు పంటను ఎలా రక్షించుకోవాలోనని టెన్షన్ పడుతున్నారు. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో వరి పంట పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. ఇప్పటికే 360 ఎకరాల్లో ధాన్యం తడిచినట్లు అధికారులు గుర్తించారు. అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షానికి జిల్లాలో 360 ఎకరాల్లో ధాన్యం తడిచి పోయింది. ఎండ కాస్తే తప్ప ధాన్యం పరిస్థితి ఏమిటన్నది చెప్పలేమని క్షేత్రస్థాయి వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇంకా వరి పంట కోయకుండా నాలుగు వేల ఎకరాల్లో అలాగే వుండిపోయింది. వానగండం దాటింది.. నేడో రేపో పంటను కోసి కల్లానికి తరలిద్దామని అనుకుంటుండగా మళ్లీ వర్షాలు కురుస్తాయన్న వార్త రైతు చెవిన పడింది. దీంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్

రానున్న రెండు రోజులూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం వుందని, జిల్లా ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. వరి పంట తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టార్పాన్లు సిద్ధంగా వున్నాయన్నారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన చర్యలు చేపట్టాలన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

- రంగుమారిన ధాన్యం కొంటాం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మొలకొచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రైతులకు భరోసా ఇచ్చారు. బొండపల్లి గ్రామంలో తుఫాన్ ప్రభావంతో నీటమునిగిన పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావుతో మాట్లాడి క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న అవస్థలు, నష్ట నివారణ, చేపట్టాల్సిన చర్యల గురించి తెలుసుకున్నారు. రంగుమారిన ధాన్యం కొనుగోలు చేసేలా మిల్లర్లకు సూచిస్తామన్నారు. జిల్లాలో 360 హెక్టార్లలో ముంపునకు గురైన పంటలను గుర్తించామని, రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల, ఏడీఏ కే.మహరాజన్, ఏవో పీవీ.మల్లిఖార్జునరావు, ఏఈవో సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ధాన్యానికి మొలక

ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో వరి పంట ఇంకా నీటిలోనే ఉంది. ఆ ధాన్యానికి మొలకలు రావడం చూసి రైతులు కలవరపడుతున్నారు. కొంత మంది పంటను కాపాడుకోవడానికి చివరి ప్రయత్నం చేస్తున్నారు. పొలాల్లోని నీరు బయటకు పంపిస్తున్నారు. లింగాలవలస, చెరుకుపల్లి, గుడివాడ, పోలిపల్లి పరిధిలో వరి పొలాల్లో నీరు ఉండడం, మొలక రావడం సోమవారం కనిపించింది.
- భోగాపురం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి):



పాపం బాలుడు

- ఆరేళ్లకే ఆయువు తీసేసిన విధి
- బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి



అఖిర్ నందన్(ఫైల్)

కొత్తవలస, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలుని ముద్దులొలికే మాటలు, కేరింతలు చూస్తూ ఆ తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయేవారు. చిన్నారి చలాకీతనం చూసి ఆనందపడేవారు. వారి సంతోషం చూసి విధికే కన్నుకుట్టిందేమో. అర్ధాంతరంగా చిట్టితండ్రి ఆయువు తీసేసింది. ఆ ఇంటి ఆనందాన్ని కబళించింది. రామలింగపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడు అఖిర్‌నందన్ విషాదాంతమిది. వివరాలిలా ఉన్నాయి.

రామలింగపురం గ్రామానికి చెందిన పిల్లల అప్పలరాజు, లక్ష్మి దంపతులకు అఖిర్‌నందన్(6), జై కృష్ణ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పరాజు ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుండగా భార్య లక్ష్మి గృహిణి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిమాని అయిన అప్పలరాజు తన కుమారునికి కూడా పవన్ కుమారుడు మాదిరిగానే అఖిర్‌నందన్ పేరు పెట్టుకున్నాడు. చిన్నారి ఎప్పుడూ ఉల్లాసంగా ఉండేవాడు. మొన్నటివరకు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా ఇటీవల సరపాం గ్రామం వద్ద నున్న ప్రైవేటు స్కూల్‌లో ఎల్‌కేజీలో చేర్చారు. ప్రతిరోజు బస్సులో వెళ్లి వస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి దగ్గరే ఉన్న అఖిర్ నందన్ అకస్మాత్తుగా వాంతులు చేసుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు కొత్తవలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు విశాఖ తీసుకెళ్లాలని చెప్పారు. విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ తనిఖీలు చేసిన వైద్యులు బాలుడుకు బ్రెయిన్ ట్యూమర్‌గా నిర్ధారించారు. చాలా కాలంగా ఉందని తెలిపారు. చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. పరిస్థితి విషమించి బాలుడు సోమవారం కన్నుమూశాడు. చిన్నారిలో అటువంటి లక్షణాలు ఎప్పుడూ కనిపించకలేదని తండ్రి అప్పలరాజు కన్నీరుమున్నీ రయ్యాడు. కళ్ల ముందు నిన్నటి వరకు కనిపించిన కుమారుడు ఇక లేడన్న విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఘటన గ్రామస్థులను సైతం కంటతడి పెట్టించింది.

దుస్తులు కొనేందుకు వెళ్లి వస్తూ..

రెండు ఆటోలు ఢీకొని 10మందికి తీవ్ర గాయాలు



రోడ్డుపై క్షతగాత్రులు, (ఇన్‌సెట్‌లో) తీవ్ర గాయాలపాలైన జమ్మయ్య

రామభద్రపురం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): వారంతా క్రిస్మస్ సందడిలో ఉన్నారు. పండగకు కొత్త దుస్తులు కొనేందుకు ఆటోలో వెళ్లారు. పని పూర్తిచేసుకుని తిరిగి స్వగ్రామానికి వస్తూ పండగ పనులపై చర్చించుకుంటుండగా అకస్మాత్తుగా ఆటోలో పెద్ద కుదుపు చోటుచేసుకుంది. వారు వెళ్తున్న ఆటో మరో ఆటోను ఢీకొంది. అంతే అప్పటివరకు మాట్లాడుకున్న వారంతా హాహాకారాలు చేశారు. ఒక్కక్కరూ ఒక్కోవైపు తుళ్లిపడ్డారు. రెండో ఆటోలో ఉన్న వారు కూడా చెరోవైపు పడిపోయారు. చినమ్మతల్లి గుడి సమీపంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. రెండు ఆటోలు ఢీకొని 10మందికి గాయాలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావివలస గ్రామానికి చెందిన కొంతమంది కలిసి ఆటో మాట్లాడుకుని పండగకు దుస్తులు కొనేందుకు బొబ్బిలి వెళ్లారు. పని పూర్తిచేసుకుని తిరిగి వస్తుండగా చినమ్మతల్లి గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొన్నారు. ఎదురుగా వస్తున్న ఆటోలో ప్రయాణిస్తున్న బొబ్బిలి మండలం రాజుపేటకు చెందిన ద్వారపురెడ్డి అచ్చియ్యమ్మ, కోరెడ్ల మంగ, బొబ్బిలికి చెందిన పారాది రూప, ఫణిశ్రీ గాయపడ్డారు. వీరి ఆటోలో ఉన్న రామభద్రపురం రావివలస గ్రామానికి చెందిన దుమ్మరి సీతయ్య, గోధుమ దివ్య, సోములు జమ్మయ్య, గోధుర సీతయ్య, గోధుర రాములమ్మ, గోధుర శైలజకు కూడా గాయాలు తగిలాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సోములు జమ్మయ్య, శైలజకు తీవ్ర గాయాలు కావడంతో బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ ఐవీ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయ నిర్మాణం వేగవంతం కావాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్



భోగాపురం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను నిర్దిష్ట కాలపరిమితికి లోబడి పూర్తి చేయాలని, పనులు వేగవంతం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం విమానాశ్రయానికి సంబంధించిన మొదటి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విమానాశ్రయం నిర్మాణంతో పాటు వివిధ కేంద్రప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీల ద్వారా చేపట్టాల్సిన ఇతర నిర్మాణాలపై సమీక్షించారు. కస్టమ్స్, బ్యూరో ఇమిగ్రేషన్, సీఐఎస్ఎఫ్ భద్రత తదితర అంశాలపై చర్చించారు. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి మెరుగైన కనక్టవిటీ ఉండాలన్నారు. సమావేశంలో కార్యదర్శి డా.ఎన్.యువరాజ్, ఏపీ మారిటైం బోర్డు సీఈవో ప్రవీన్ ఆదిత్య, భోగాపురం విమానాశ్రయ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, పౌర విమానయాన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విదర్భ, ఛత్తీస్‌గఢ్ జట్ల విజయం

- విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీల మోత
- కరణ్ నాయర్ సెంచరీతో విదర్భ విజయం
- ఛండీగఢ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్‌కు వాతావరణ అడ్డంకులు
- వీజెడ్ విధానంలో 13 పరుగుల తేడాతో ఛత్తీస్‌గఢ్ విజయం



6లో

'కాసు'కూర్చున్నారు జాగ్రత్త!

- సమీపిస్తున్న పండగలు
- సామాన్యుడికి రుణం పేరుతో 'ఫైనాన్స్' గాలం
- స్థిర ఆస్తులతో ముడి
- ఏజెంట్లతో వల విసురుతున్న సంస్థలు
- రూ.10 లక్షల లోన్‌కు రూ.లక్ష మేర తీసుకునే వ్యూహం

6లో

ఈ-స్టాంపింగ్‌తో అక్రమాలకు చెక్!

- ఆధార్ అనుసంధానంతో స్టాంపుల జారీ
- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త విధానం

6లో



ఈ స్టాంపింగ్‌తో అక్రమాలకు చెక్!



- ఆధార్ అనుసంధానంతో స్టాంపుల జారీ
- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త విధానం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గజపతినగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

ఆస్తుల క్రయ, విక్రయాలకు అవససరమైన స్టాంపులు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దొరక్క ప్రజలు తిప్పలు పడాల్సి వచ్చేది. సరఫరా అయిన స్టాంపుల్లో కొందరు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించే వారు. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారు. అటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్-జుడీషియల్ స్టాంపుల అమ్మకాన్ని ప్రక్షాళన చేస్తూ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల కొనుగోలుకు ఆన్‌లైన్ విధానం తీసుకువచ్చింది. ఆధార్ అనుసంధానంతో స్టాంపులు జారీ చేస్తోంది.

వైసీపీ ప్రభుత్వం ఈ-స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూట గట్టుకుంది. కూటమి ప్రభుత్వం తిరిగి నాన్-జుడీషియల్ వైపు మొగ్గు చూపుతూ స్టాంపుల కొనుగోలును ఆన్‌లైన్‌లో చేపట్టేలా చర్యలు తీసుకుంది. అందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద మొత్తంలో స్టాంపులను తెప్పించి సరఫరా చేసింది. నాన్-జుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో ఒక పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలను నమోదు చేసి రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. ఆ తర్వాత స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపు వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుండేవారు. దీనివల్ల కొందరు వెండర్లు ఎక్కువ మొత్తంలో స్టాంపులు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపించాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలు వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎక్కువయ్యేవి. నకిలీ స్టాంపులు వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. స్టాంపుల కొనుగోలుకు ఆన్‌లైన్ విధానం తీసుకువచ్చింది.

కొత్త విధానం ఇలా..

ఆధార్ నంబర్‌ను వెండర్ కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కౌంటర్‌లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒక వ్యక్తి 5 నుంచి 10 స్టాంపుల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబర్ నమోదు వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది. ప్రైవేటు స్టాంప్ వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్ ప్రింట్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కౌంటర్లలో ఏయే స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా సాగే కార్యాలయాల నుంచి అవసరమైన వారు తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. స్టాంపు తీసుకోవాలంటే ఆధార్ నెంబరు తప్పనిసరి చేయడంతో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేదు.

అందుబాటులో స్టాంపులు..

నాన్-జుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నెంబర్ నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. స్టాంప్ వెండర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నాన్-జుడీషియల్ స్టాంపుల విక్రయాలపై వెండర్లకు శిక్షణ ఇచ్చాం.

-ఎస్.తవిటయ్య, సబ్-రిజిస్ట్రార్

విదర్భ, ఛత్తీస్‌గఢ్ జట్ల విజయం

- విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీల మోత
- కరణ్ నాయర్ సెంచరీతో విదర్భ విజయం
- ఛండీగఢ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్‌కు వెలుతురు అడ్డంకి
- వీజెడ్ విధానంలో 13 పరుగుల తేడాతో ఛత్తీస్‌గఢ్ విజయం

విజయనగరం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆధ్వర్యంలో జిల్లా వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆతిథ్యమిస్తున్న దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ, ఛత్తీస్‌గడ్ జట్లు, ప్రత్యర్థి జట్లపై విజయాలను అందుకున్నాయి. నగరంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో జమ్ము కాశ్మీర్, విదర్భ జట్ల మధ్య సోమవారం నిర్వహించిన మ్యాచ్‌లో విదర్భ జట్టు జమ్ము కాశ్మీర్ జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. విదర్భ జట్టు తొలుత టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన జమ్ము కాశ్మీర్ జట్టు 44.1 ఓవర్లలో 221 పరుగులకు ఆల్ అవుటైంది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్ వి.శర్మ 65 (65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) పరుగులు, కెప్టెన్ పి.కె.దోగ్రా 42, అకిబ్ నబీ 45 పరుగులతో రాణించి జట్టుకు స్కోర్‌ను అందించారు. విదర్భ జట్టు బౌలర్లలో బూటే, హర్ష దూబె మూడేసి వికెట్లు సాధించగా, పి.ఆర్.రేఖే 2 వికెట్లు సాధించి జమ్ము కాశ్మీర్ జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అనంతరం 222 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విదర్భ జట్టు 37.1 ఓవర్లలోనే 225 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. జట్టు ఓపెనర్లు అథర్వ తైదే (9 పరుగులు), ధృవ్ సోరే (20 పరుగులు) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగినా, వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కరుణ్‌నాయర్ ధాటిగా ఆడి (112 నాటౌట్, 108 బంతుల్లో 17 ఫోర్లు) అజేయ సెంచరీతో జట్టును గెలిపించాడు. అతనికి మిడిలార్డర్ బ్యాటర్లు వైవీ రాథోడ్ (22 పరుగులు), వికెట్ కీపర్ జె.ఎం.శర్మ (43) సహకారం అందించారు.



విదర్భ బ్యాటింగ్

● అమన్‌దీప్ ఖరే సెంచరీ, ఛత్తీస్‌గఢ్ విజయం..

డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరిగిన చండీగర్, ఛత్తీస్‌గడ్ జట్ల హోరాహోరీగా సాగిన మ్యాచ్‌కు వెలుతురు అడ్డంకిగా మారింది. దీంతో అంపైర్లు వీజెడ్ విధానంలో అప్పటికే విజయానికి అవసరమైన నెట్ రన్‌రేట్ ఉండటంతో ఛత్తీస్‌గడ్ జట్టును విజేతగా ప్రకటించారు. తొలుత ఛత్తీస్‌గడ్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా, చండీగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 322 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జట్టు ఓపెనర్లు అర్సలాన్ ఖాన్ డక్ అవుట్‌గా వెనుదిరగ్గా, కెప్టెన్ మన్‌వొహ్రా (16) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. ఈ దశలో వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చిన శివం భాంబ్రీ 152 (134 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సులు) ధాటిగా ఆడి భారీ సెంచరీ సాధించగా, మిడిలార్డర్ బ్యాటర్లు తుషార్ జోషి (59 పరుగులు), ఎ.కె.కౌశిక్ (22 బంతుల్లో 51 పరుగులు) అర్ధ సెంచరీలతో రాణించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ఛత్తీస్‌గడ్ బౌలర్లలో రవికిరణ్, శశాంక్‌సింగ్ రెండేసి వికెట్లు సాధించగా, గగన్‌దీప్ సింగ్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం 323 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఛత్తీస్‌గడ్ జట్టు తొలినుంచి రన్‌రేట్ తగ్గకుండా ధాటిగానే ఆడింది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు తొలి వికెట్ భాగస్వామ్యానికి 34 పరుగులు జోడించగా 9 పరుగులు చేసిన ఏజీ తివారీ.. జెఎస్ సంధు బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. మరో 4 పరుగుల తేడాతో 24 పరుగులు చేసిన మరో ఓపెనర్ భూపేన్ లాల్వాని (24 పరుగులు) 38 పరుగుల స్కోర్ వద్ద నిఖిల్ శర్మ బౌలింగ్‌లో తుషార్ జోషికి క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ అమన్‌దీప్ ఖరే (100 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సులతో 121 పరుగులు) అజేయ సెంచరీతో వన్‌డౌన్ బ్యాటర్ సంజీత్ దేశాయ్ (54 పరుగులు) మూడో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయగా, మిడిలార్డర్ బ్యాటర్ గగన్‌దీప్‌సింగ్ (51 పరుగులు)తో మరో 104 పరుగుల సెంచరీ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. ఆ తరువాత బ్యాటింగ్ వచ్చిన శశాంక్ సింగ్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు - 32 పరుగులు నాటౌట్) అజేయంగా 64 పరుగుల భాగస్వామ్యాన్ని చేసిన దశలో (46.3 ఓవర్) వెలుతురు మందగించడంతో అంపైర్లు ఆటను నిలిపేశారు. ఈ దశలో గెలుపునకు సరిపడా నెట్‌రేట్ సాధించిన ఛత్తీస్‌గడ్ జట్టును 13 పరుగుల తేడాతో గెలుపొందినట్లు అంపైర్లు ప్రకటించారు. విజయాలు సాధించిన విదర్భ, ఛత్తీస్‌గడ్ జట్లకు నాలుగేసి పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ల్లో పాల్గొన్న జట్లలో పలువురు అంతర్జాతీయ ఆటగాళ్లు ఉండటంతో అభిమానులు వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగడానికి ఉత్సాహం చూపారు.



సెంచరీ అభివాదం చేస్తున్న విదర్భ క్రికెటర్ కరణ్



మ్యాచ్‌ను తిలకిస్తున్న ప్రజలు



రోడ్డా.. నదా?

భోగాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిది. రాజాపులోవ సమీపంలో ఇలా మారింది. నదిలో నుంచి వాహనాలు వెళ్తున్నాయా? అనే భ్రమ కలుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు ఎక్కడ గోతి ఉందోనని ముందు వెళ్తున్న వాహనాల్ని అనుసరిస్తూ కాస్త నెమ్మదిగా రాకపోకలు సాగిస్తున్నారు.

'కాసు'కూర్చున్నారు జాగ్రత్త!

- సమీపిస్తున్న పండగలు ● సామాన్యుడికి రుణం పేరుతో 'ఫైనాన్స్' గాలం
- స్థిర ఆస్తులతో ముడి ● ఏజెంట్లతో వల విసురుతున్న సంస్థలు
- రూ.10 లక్షల లోన్‌కు రూ.లక్ష మేర తీసుకునే వ్యూహం

గజపతినగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తోంది. పైసలు లేనిదే పండగ జరుపుకోలేం. కొత్త దుస్తుల కొనుగోలు నుంచి పిండివంటల తయారీ వరకు ప్రతిదీ ఖర్చుతో కూడకున్నదే. ఈ పరిస్థితిలో సామాన్యునికి ప్రత్యామ్నాయం రుణాలే. ఈ అదును కోసం కొన్ని ఫైనాన్స్ సంస్థలు కాసుకూర్చున్నాయి. 'ఆస్తులుంటే చాలు ఎంతైనా రుణాలు ఇస్తాం.. మీరేమీ దిగులు చెందవద్దు.. అన్నీ మేమే చూసుకుంటామని' ఫైనాన్స్ సంస్థలు దిగుతున్నాయి. గాలం వేస్తున్నాయి. అప్పులు ఇవ్వడానికి సిద్ధమైన ఫైనాన్స్ సంస్థలు తిరిగి వారు చెల్లిస్తారా లేదా అనే సందేహం లేకుండా వారి ఆస్తులను తనఖా పెట్టుకుంటున్నారు. అవసరాలు ఉన్న ప్రజలు తమ ఇళ్లను ఫైనాన్స్ సంస్థలకు చూపుతున్నారు. భవిష్యత్‌లో ఆ ఫైనాన్స్ మాఫియా ఇళ్లను స్వాధీనం చేసుకునే వరకూ వెళ్తుంది. ఈ తంతు చాలాచోట్ల జరిగింది. జరుగుతోంది.

ఒకప్పుడు కాల్‌మనీ ప్రకటనల వైపు జనం మొగ్గుచూపేవారు. తర్వాత వడ్డీల భారం తట్టుకోలేక చేసిన అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కోకొల్లలు. వాటి ఫలితంగా అప్పటి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. ఆయా సంస్థల వేధింపులను పోలీసుల ద్వారా కట్టడి చేసింది.

ఆ తర్వాత కొన్నాళ్లు అప్పులు ఇచ్చే సంస్థల్లో ఎటువంటి కదలిక లేదు. మళ్లీ ఇప్పుడు ఫైనాన్స్ సంస్థలు కార్యాలయాలను ప్రారంభించాయి. రుణాలపై ఆకర్షణీయమైన కమీషన్‌లను ఆఫర్ చేయడంతో ఏజెంట్లు పుట్టుకొచ్చారు. వారంతా గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ఆర్థిక అవసరాలు ఉన్నవారిని గుర్తిస్తున్నారు. వారికి రుణాలు ఇప్పిస్తామని చెబుతున్నారు. అందుకు అవసరమైన ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు కావాలని పురమాయించడమే కాకుండా వాటి రిజిస్ట్రేషన్ బాధ్యతలను చూసుకుంటామని భరోసా కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్ అయిన తరువాత రకరకాల చార్జీల పేరుతో రూ.50 వేల వరకూ దోచుకోవడమే కాకుండా రుణం ఇప్పించినందుకు అదనంగా కూడా దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మార్ట్‌గేజ్ పత్రాల్లో ఉన్న సారాంశాన్ని చెప్పడం లేదనే విమర్శలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని మార్ట్‌గేజ్ కింద ఫైనాన్స్ సంస్థల పేరుతో మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించి రుణాలు మంజూరు చేయిస్తున్నారు.



వడ్డీకి వడ్డీలు..

ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు సులభంగా దొరుకుతున్నాయని ప్రజలు సంబరపడుతున్నారే గానీ దాని వల్ల భవిష్యత్‌లో పొంచి ఉన్న ముప్పును ఆలోచించడం లేదు. నెలనెలా చెల్లించాల్సిన వాయిదాలు సక్రమంగా చెల్లించకపోతే వడ్డీతో పాటు చక్రవడ్డీలు వేస్తున్నాయి. వారు ముందుగానే సంతకాలు చేయించుకున్న ఒప్పందపత్రాల ప్రకారం గడువు లోపు రుణం తీర్చకపోతే వేలం వేసి ఆస్తులను జప్తు చేసుకోవడానికి ప్రయత్నించడం జిల్లాలో చాలాసార్లు జరిగింది.

రిజిస్ట్రేషన్ కోసం దందాలు..

ఫైనాన్స్ సంస్థలు నియమించుకున్న సిబ్బందికి లోన్‌ల టార్గెట్ ఇస్తున్నారు. ఆ టార్గెట్ ప్రకారం రుణాలు ఇప్పిస్తే ఆకర్షణీయమైన కమీషన్లు ఇస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న ఫైనాన్స్ సంసల ఏజెంట్లు ఎటువంటి పత్రాలు లేని పక్కా ఇళ్లకు ఇంటి పన్ను ఆధారంగా ధ్రువీకరణ పత్రాలను తయారు చేస్తున్నారు. ఆ పత్రాల తయారీకి సంబంధించి అధికారులకు లంచాలు ఇవ్వాలంటూ పేదల దగ్గర నుంచి కొంత మొత్తం లాగేస్తున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనూ హడావుడి చేసి సొమ్ము గుంజేస్తున్నారు. ఇలా రూ.10 లక్షల రుణానికి రూ.లక్ష వరకూ వారే స్వాహా చేస్తున్నారు. ఆ భారం తుదకు తనఖాదారుడిపైనే పడుతోంది. ఈనేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇటువంటి ఫైనాన్స్ సంస్థలపై డేగ కన్ను వేయాల్సిన అవసరం ఉంది. రాబోయే రోజుల్లో ఫైనాన్స్ సంస్థల ఆగడాలకు ప్రజలు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలనేది బాధితుల మాట.

పర్యావరణ హితుడు!

- మొక్కలు పెంచాలంటూ ముత్తుచిల్వాన్ సైకిల్ యాత్ర
- తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు నుంచి ప్రారంభం



మొక్కలు నాటాలని కోరుతూ సైకిల్ యాత్ర చేస్తున్న ముత్తు చిల్వాన్

సాలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ రక్షణకు మొక్కలు పెంచడమే సరైన మార్గమని తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు చిల్వాన్ దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సైకిల్ యాత్ర సాలూరు మండలం జీగిరాం మీదుగా ఒడిశాలో ప్రవేశించింది. స్మార్ట్ మొబైల్, సినిమాలు, స్నేహితులు అంటూ యువత కాలం గడిపేస్తున్న తరుణంలో ముత్తు చిల్వాన్ అందుకు భిన్నంగా ఆలోచించాడు. ప్రకృతి అసమతుల్యం అతడిని కదిలించింది. ఓజోన్ పొర దెబ్బతింటుండడం, ఆకస్మిక వానలతో వరదలు, తీవ్రమైన ఎండలు, ప్రాణ, ఆస్తినష్టాలకు ఆవేదన చెందిన ఆయన మొక్కలు నాటించడమే వల్లే ప్రకృతి పరిరక్షణ సాధ్యమని గుర్తించారు. దీంతో చిల్వాన్ మొక్కలకు హితుడయ్యారు. మొక్కలు నాటాలని వియత్నాం, మయన్మార్, నేపాల్, బంగ్లాదేశ్‌ల్లో ఇదివరకే పర్యటించారు. ప్రస్తుతం కోయంబత్తూరు నుంచి 34,200 కిలోమీటర్లు దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో సైకిల్ యాత్రను చేపట్టారు. దేశవ్యాప్తంగా పది లక్షల మొక్కలు నాటించాలనే ధ్యేయంతో సైకిల్ తొక్కుతున్నారు. దారి పొడవునా మొక్కలు నాటిస్తున్నారు. వచ్చే ఏడాది తన 34,200 కిలోమీటర్ల లక్ష్యం ఢిల్లీ చేరుకోవడంతో పూర్తవుతుందని చిల్వాన్ చెప్పారు. తాను వెళ్తున్న మార్గంలో అందరి నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడానికి, నాటించడానికి ప్రయత్నించాలని ఆయన పిలుపునిచ్చారు.

భామినిలో పత్తి కొనుగోలు కేంద్రం

- ఏర్పాటుపై రైతుల హర్షం

భామిని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భామినిలో ఎట్టకేలకు పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటైంది. రైతుల కల నెరవేరింది. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సోమవారం జాయింట్ కలెక్టర్ శోభిక, ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభించారు. క్వింటా ధర రూ.7,521గా నిర్ణయించగా.. పీసీఐఎల్ ఈ-క్రాప్ నమోదు, పత్తి నాణ్యత పరిశీలించిన అనంతరం పంటను కొనుగోలు చేస్తుంది. ఇక్కడ నిల్వ ఉంచే అవకాశం లేకపోవడంతో వెంటనే మిల్లులకు తరలిస్తారు. మొత్తంగా భామినిలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల భామినితో పాటు సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, కురుపాం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. గతంలో సాలూరు వరకు వెళ్లి పంటను విక్రయించాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లమని, దూరాభారంతో పాటు రవాణా ఖర్చులు తడిసిమోపెడు అయ్యేవని పలువురు వాపోతున్నారు. ఇదిలా ఉండగా కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భామిని మండలంలో వడ్డంగి లిఫ్ట్ ఇరిగేషన్‌కు గతంలో టీడీపీ ప్రభుత్వం రూ. 32 కోట్లు మంజూరు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. తోటపల్లి ఎడమ కాలువకు రూ.195 కోట్లు మంజూరు చేస్తే 23 శాతం పనులే కావడంతో ఆ నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయాయన్నారు. అనంతరం ఘనసరలో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ డీపీటీశ్రీనివాస్‌కిరణ్, అగ్రికల్చర్ జేడీ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

27న వాలీబాల్ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7 నుంచి 13 వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి మహిళలు, పురుషుల సీనియర్ వాలీబాల్ పోటీలకు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 27న నిర్వహించనున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డు, స్థానికతను తెలిపే ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

గుషిణిలోనే ఉంచాలి

నెల్లిమర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుషిణి పంచాయితీలోని బర్లపేట రేషన్ కార్డులను చనమల్లుపేట డిపోకు మార్పు చేయకుండా.. ఈ డిపో పరిధిలోనే ఉంచాలని పి.రామకృష్ణ, బి.రమణ మరికొంతమంది విజయనగరం ఆర్డీఓను కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్‌డిఓ కీర్తికి వినతిపత్రం అందజేశారు

ఆర్థిక సాయం

విజయనగరం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దాసన్నపేటకు చెందిన దువ్వు వెంకటేష్ ఐటీబీపీ (పారా మిలటరీ) జవాన్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 13న కన్నుమూశారు. తోటి జవాన్లు ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ, సోమవారం రూ.82 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి, జవాను ఉరిటి పైడినాయుడు, ఎ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

వంగర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టరు అంబేద్కర్‌ని అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని దళిత జేఏసీ నాయకులు గణపతి తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు.

ఆందోళనకు సిద్ధం

రాజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని రాజాం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతుందన్నారు

జోన్ చైర్మన్‌గా సతీష్ కుమార్

జామి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జామికి చెందిన తీగెల సతీష్ కుమార్ వాసవీక్లబ్ జోన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు వాకచర్ల భాస్కరరావు, సుబ్బరాజు, పసుమర్తి శ్రీనువాసరావు, సంతోష్ కుమార్, సాయి హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గణిత దినోత్సవం

వేపాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోంపురం, వేపాడ, బక్కునాయుడుపేట తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి బాల భాస్కరరావు, గణిత ఉపాధ్యాయుడు రవిశంకర్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

రాజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 22న జరిగిన స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ అండర్ 19 విభాగంలో బి దీక్షిత 47 కేజీల విభాగంలోను, జి.చరణ్ రామ్ సాయి 66 కేజీల విభాగంలో బంగారు పతకాలు కైవసం చేసుకున్నారని స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చీకటి కేశవనారాయణరావు తెలిపారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమరావు, అధ్యాపక బృందం అభినందించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

చీపురుపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షకు వ్యతిరేకంగా గత నెల రోజుల పాటు జరిగిన వివిధ ప్రచార కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. చివరి రోజైన సోమవారం చీపురుపల్లి పట్టణంలోని విజయా కాలనీలో డ్వాక్రా మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, సీసీలు గోవింద్, వీఏఓ కుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక నిల్వలు

భోగాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజాపులోవ, పోలిపల్లి గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ నిల్వలు స్టాకు పాయింట్లుగా దర్శనమిస్తున్నాయి. ఇసుకను లారీలు, ట్రాక్టర్లతో తీసుకొచ్చి ఈ ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఇసుక నిల్వలు ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం: మంత్రి

గజపతినగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు పెద్ద ఎత్తున వస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానం వల్ల దేశ విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులకు ముందుకు వస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు వచ్చేందుకు సుముఖత చూపలేదన్నారు. పారిశ్రామిక వేత్తలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయన్నారు. రాష్ట్రానికి వస్తున్నపెట్టుబడి దారులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గిరిజన యూనివర్సిటీకి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నియోజకవర్గ పరిధిలో 50వేలకు పైబడి సభ్యత్వ నమోదు చేసినట్టు వివరించారు. తుఫాన్ కారణంగా సుమారు 400 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు చెప్పారని వివరించారు. రైతులకు తమ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి శ్రీనివాస్ తెలిపారు.



మంత్రి సమక్షంలో టీడీపీలో చేరిన పెదకాద వైసీపీ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

గజపతినగరం/దత్తిరాజేరు, డిసెంబరు 23: (ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు మండలం వంగర, పప్పల లింగాలవలస, పెదకాద, కోరపు కొత్తవలస మరడాం, గ్రామాల నుంచి వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులతో పాటు 600 కుటుంబాలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని తెలిపారు. టీడీపీలో చేరిన వారిలో పెదకాద గ్రామ సర్పంచ్ గుజ్జ మంగ, ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు, ఎంపీటీసీ నాగిరెడ్డి సత్యం, కోరపు కొత్తలస గ్రామసర్పంచ్ వేండ్రాపు వెంకటనాయుడు, మాజీ సర్పంచ్ వేండ్రాపు అప్పలనాయుడు, నలుగురు వార్డు సభ్యులు, మరడాం సర్పంచ్ పోతుల రామలక్ష్మి, తో పాటు ముగ్గురు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. వంగర గ్రామం నుంచి దత్తి రామకృష్ణ, తిరుపతి నాయుడు, కొలుసు బంగారి, పప్పల లింగాలవలస నుంచి గాదాపు నారాయణరావు, కిలపర్తి తిరుపతి, కడియాల పర్సయ్య తదిత రులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో దత్తిరాజేరు, బొండపలి, గంట్యాడ మండల పార్టీల అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్, కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, పి.వి.వి. గోపాలరాజు పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రిగా సీహెచ్‌సీ: ఎమ్మెల్యే

భోగాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. సోమవారం స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడానని చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గాన్ని మినీ స్మార్ట్‌సిటీగా తయారు చేయడానికి కృషి చేస్తున్నానని వివరించారు. వైద్యులు సమయ పాలన పాటించాలన్నారు. ఆసుపత్రిలో దిండ్లు, బెడ్‌షీట్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఇక్కడికి వచ్చే రోగులను రిఫర్ చేయకుండా చూడాలన్నారు. అంతకుముందు ఆసుపత్రి అంతా తిరిగి పరిశీలించారు. బాలింతలతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి.వెంకటేష్, మండల పరిషత్ ఏవో ఏవీ కామేశ్వరరావు, బొల్లు త్రినాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

చెరుకుపల్లి గ్రామస్తులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం గ్రామంలో తహసీల్దార్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామంలో కొంతమందికి ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపించలేదని బాధితులు ఆమెకు వివరించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రిక్కా దుర్గాలమ్మ, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

జనసేనలో చేరికలు...

ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే నాగమాధవి ఆధ్వర్యంలో నెల్లిమర్ల మండలం పెదబూరాడపేటలోని వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు జనసేనలో చేరారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక జనసేన నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోమవారం కలిశారు. నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలను సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా ఆర్ఈసీఎస్ సంస్థ పునరుద్ధరణ, చీపురుపల్లిలో ఉన్న ఏరియా ఆసుపత్రిలో వంద పడకల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. కొత్త రోడ్ల నిర్మాణం, పాడైన రోడ్లకు మరమ్మతులు, జలజీవన్ మిషన్ అమలు, గరివిడి పశు వైద్య కళాశాలలో గల వివిధ సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే కళా వెంకటరావు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

రైతులకు న్యాయం చేస్తా



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రాజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అపరాల పంటలు వేసిన రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని వ్యవసాయ శాఖ సైంటిస్టు డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అపరాలకు అపారనష్టం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. గుయ్యన్నవలస గ్రామంలో పెసర, మినప పంటలను పరిశీలించార ు. తుఫాన్ కారణంగా వర్షపు నీరు పంట పొలాల్లో నిల్వ ఉండిపోవడం వల్ల పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. మొలకలు కూడా వచ్చాయని... ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయనతో పాటు ఏఓ రేణుకాసాయి. సిబ్బంది భారతి రైతులు ఉన్నారు.

ఉపాధి పనులు ముమ్మరం: కలెక్టర్

విజయనగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు సంబంధించి నిధులు వ్యయం చేయక పోతే, జిల్లాకు నష్టం చేసినట్టేనని... మెటీరియల్ నిధులు వినియోగించి పనులు ముమ్మరం చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగు అధికారులను కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, పంచాయితీరాజ్ ఇంజనీర్లతో 'పల్లె పండుగ'లో భాగంగా చేపడుతున్న పనులను విషయమై సమీక్షించారు. పల్లె పండుగ కింద గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, మెటల్ రోడ్లు, పశువుల శాలల నిర్మాణం తీరుపై కలెక్టర్ అంబేడ్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలసత్వం చూపే అధికారులపై చర్యలకు వెనుకాడబోనని స్పష్టం చేశారు. రెండు నెలలు కావస్తున్నా 50 శాతం పురోగతి లేదని... ఇదే తరహాలో చేస్తే సంక్రాంతి పండుగ నాటికి జిల్లాలో పల్లె పండుగ పనులు పూర్తి చేయడం అసాధ్యమని తేల్చి చెప్పారు. జిల్లాకు రూ.350 కోట్ల ఉపాధి హామీ మెటీరియల్ నిధులు కేటాయించారని తెలిపారు. వాటిని మార్చి నెలలోగా ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ మంజూరు చేసిన పనులనే చేయలేకపోతున్నందున నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కోరిన అదనపు పనుల మంజూరుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డ్వామా ఏఓ వెంకట రమణ, గ్రామ, వార్డు సచివాలయ అధికారి నిర్మలాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

విజయనగరం క్రైం, డిసెంబరు 23: (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 17 ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగదాలకు సంబంధించి 5, కుటుంబ కలహాలకు సంబంధించి 3, మోసాలకు పాల్పడినట్టుగా 4, ఇతర అంశాలకు సంబంధించి 5 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శంకరరావు, ఎస్‌బీ సీఐ లీలారావు, ఎస్ఐ రాజేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి

గజపతినగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి రెవెన్యూ అధికారులు అనుమతులు మంజూరు చేయాలని కల్లుగీత వృత్తిదారుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పురం అప్పారావు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొలుసు కోటరావు కోరారు. ఈమేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శోభకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంతతోటలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

జామి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట గ్రామంలో ఉన్న శ్రీపుష్పగిరి వేణుగోపాలస్వామికి ధనుర్మాసం సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ఇసుక క్వారీల నిర్వహణ వాస్తవమే

రేగిడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలసలో ఇసుక క్వారీలు వాస్తవమేనని తహసీల్దారు చిన్నారావు స్పష్టం చేశారు. దీనిపై ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో 'పర్యవేక్షణ లేక..ఇసుక దందా ఆగక' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో వీఆర్‌ఓ దుర్గారావు బొడ్డవలస నదీతీర ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. నదికి అవతల రెండు జేసీబీలతో తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఇది ఉమ్మడి జిల్లాల సరిహద్దు ప్రాంతమని... తమ పరిధి కాదని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వివరించారు.

క్రైం కార్నర్

బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మహిళ కాళ్లు

- రెండు గంటలు నరక యాతన
- అరికతోట వద్ద ఘటన
- తప్పిన పెను ప్రమాదం



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మహిళ, ప్రమాద దృశ్యం

రామభద్రపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరిక తోట జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ముందు వెళ్తున్న బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో బొండపల్లి మండలంలోని గరుడబిల్లికి చెందిన రెడ్డి మహాలక్ష్మి ముందు సీటులో కూర్చొంది. ఆ సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. ముందు వెళ్తున్న లారీ వేగం డ్రైవర్ ఒక్కసారిగా తగ్గించాడు. అదే సమయంలో వెనుకన ఉన్న బస్సు నెమ్మదిగా వెళ్తోంది. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ బస్సును ఢీకొంది. దీంతో మహాలక్ష్మి రెండు కాళ్లు డ్రైవర్ సీటు పక్కనే ఉన్న క్యాబిన్‌లో ఇరుక్కుపోయాయి. ఆమె బయటకు రాలేకపోవడంతో రెండు గంటలపాటు బస్సులోనే నరకయాతన అనుభవించింది. ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో అరికతోట బీసీకాలనీకి చెందిన యువత, కొంతమంది ప్రయాణికులు యంత్రాలతో లారీని, బస్సును వేరుచేసి ఆమెను బయటకు తీశారు. రెండుకాళ్లు ఇరుక్కుపోవడంతో ఆమె హాహాకారాలు చేసి బాధతో అల్లాడిపోయింది. ఈ ప్రమాదంలో మహాలక్ష్మి రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. బయటకు తీసిన ఆమెను రామభద్రపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరికొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఆర్డీవో రామ్మోహనరావు, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహాలక్ష్మితో మాట్లాడారు. ఈ మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదుచేశారు. కాగా రెండు కాళ్లు ఇరుక్కున్న మహాలక్ష్మి బయటకు లాగి రక్షించడంలో అరికతోట బీసీ కాలనీకి చెందిన యువత శ్రమించారు.ఆమెకు ధైర్యం చెబుతూ ఎప్పటికప్పుడు నీరందించడంతోపాటు సహకరించారు. సంఘ టనా స్థలంలో ప్రమాద ఘటన చూడడానికి వందలాది మంది తరలివచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంతకవిటి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పొనుగుటివలస గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి (65) మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాలివీ... పొనుగుటివలస గ్రామ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వ్యక్తి.. ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజ్ గేట్ ఎదురుగా ఉన్న బస్ షెల్టర్‌లో బస చేసేవాడు. ఇటీవల రోడ్డు పనుల్లో భాగంగా బస్‌షెల్టర్ కూల్చివేయడంతో మృతుడు రోడ్డు పక్కనే జీవనం సాగించేవాడు. నాలుగు రోజులు నుంచి వర్షాలు కురుస్తుండడంతో తడిసిపోయి... అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. వీఆర్‌వో మోనంగి రోజారమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ఎమ్.వాసుదేవరావు తెలిపారు.

వ్యసనాలకు బానిసై... దొంగగా మారి!

రాజాం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వరకూ చదివాడు. వ్యసనాలకు బానిసయ్యాడు. అప్పుడప్పుడు బెట్టింగులు కట్టేవాడు. దీని కోసం సులభంగా ఆదాయం సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను కొల్లగొట్టడం ప్రారంభించాడు. ఇటీవల రేగిడి పోలీసులకు పట్టుబడ్డాడు. దర్యాప్తులో సంతకవిటి మండలంలో చోటుచేసుకున్న దొంగతనాలను సైతం తానే చేశానని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి బంగారం, వెండి, నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు సోమవారం సాయంత్రం రాజాంలో న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం రేగిడి ఎస్.ఐ. పి.నీలవేణితో కలిసి రూరల్ సి.ఐ. హెచ్.ఉపేంద్రరావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. రేగిడి మండలం తునివాడ గ్రామానికి చెందిన వంజరాపు లలితమ్మ తన ఇంట్లో చోరీ జరిగిందని ఈ నెల 8న రేగిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్.ఐ. నీలవేణి, సిబ్బంది రంగంలోకి దిగారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం యరకారాయపురం గ్రామానికి చెందిన శ్రీరామ బాలరాజు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఇటీవల అదుపులోకి తీసకున్నారు. లలితమ్మ ఇంట్లో దొంగతనంతో పాటు రేగిడి మండలం కాగితాపల్లి, దేవుదళ, సంతకవిటి మండలం కొండగూడేం గ్రామాలలో జరిగిన చోరీలు తానే చేసినట్లు పోలీసుల దర్యాప్తులో నిందితుడు బాలరాజు అంగీకరించాడు. దీంతో అతని నుంచి రూ.7.20 లక్షల విలువ చేసే 90 గ్రాముల బంగారం, రూ.30 వేల విలువ చేసే 30 తులాల వెండి, రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు సి.ఐ.ఉపేంద్రరావు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సి.ఐ., ఎస్.ఐ.

అదుపు తప్పి... లారీ బోల్తా

గజపతినగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కాలువలో సోమవారం వేకువజామున అదుపు తప్పి లారీ బోల్తా పడింది. రాయగడ నుంచి విజయనగరం వైపు వెళుతున్న లారీ రోడ్డు పక్కన కాలువ పనులు చేపడుతున్న కారణంగా మట్టిలో కూరుకుపోయి, లారీ కల్వర్టు కిందకు ఒరిగిపోయి ఉంటుందని స్థానికులు అంటున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



కాలువలో పడిన లారీ

క్వారీ లారీ బోల్తా...

వేపాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వావిలపాడు సమీపంలోని క్రషర్ల నుంచి రాతి పిక్కతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తూ ఆనంద చెరువులో బోల్తా పడింది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక క్రషర్ల నుంచి రాతి పిక్క లోడుతో విశాఖపట్నం వెళుతున్న లారీ... ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు.



బోల్తా పడిన లారీ

సారా విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండల కేంద్రంలోని కళాశాల సెంటర్ వద్ద నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 120 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ సింహాద్రి సోమవారం తెలిపారు. నాటుసారా రవాణా చేస్తున్న ఆర్.వినోద్‌ని అదుపులోకి తీసుకుని పార్వతీపురంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ ఎస్‌వీ రామారావు, హెచ్‌సీ సుదర్శన్‌కుమార్, కానిస్టేబుళ్లు రాము, మనోజ్‌లు పాల్గొన్నట్టు తెలిపారు.

తగ్గేదేలే

(ఐదో పేజీ తరువాయి)

దీనికి అలవాటు పడింది. అందుకే వినియోగం తగ్గడం లేదు. మరోవైపు సరిహద్దుల్లో పండిన పంటను రవాణా చేసే సమయంలో ఎవరికీ దొరకకుండా స్మగ్లర్లు ముందు, వెనక కాన్వాయ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. స్థానిక యువతను మధ్యవర్తులుగా వాడుకుంటున్నారు. పోలీస్‌ల తనిఖీల గురించి తెలుసుకుంటున్నారు. ఇలా ఏర్పాటు చేసుకున్న మనుషులద్వారా వేర్వేరు దారుల్లో గంజాయిని తాము అనుకున్న ప్రదేశానికి చేర్చుతున్నారు. ఒడిశా సరిహద్దు అల్లూరి సీతారామరాజు జిల్లాను, శృంగవరపుకోట మీదుగా వున్న విశాఖ-అరకు రోడ్డును బాగా వినియోగించుకుంటున్నారు. కిరండోల్ ట్రైన్ కూడా రవాణాకు ఉపయోగపడుతోంది. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిలకల గెడ్డ సమీప గ్రామాల మీదుగా తాటిపూడి రహదారిలోనూ గంజాయి తరలుతోంది. అరకు నుంచి సాలూరుకు కూడా వెళ్తోంది.

అరకు పర్యాటక ప్రాంతం కావడంతో నిత్యం కార్లు, జీపులు, బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. గంజాయి స్మగ్లర్లకు ఇవే సహకరిస్తున్నాయి. పర్యాటకుల ముసుగులో గంజాయిను దాటిస్తున్నారు. కార్లు, ఇతర వాహనాలకు ప్రత్యేక అరలను ఏర్పాటు చేసి అందులో వందల కేజీలను దాస్తున్నారు. పోలీసుల తనఖీలు చేపడుతున్నా ఎంతో నిశితంగా పరిశీలిస్తేనే తప్ప పట్టుబడడం లేదు. ద్విచక్రవాహనాల్లో కేజీ నుంచి ఐదు కేజీల వరకు బ్యాగుల్లో పట్టుకుపోతున్నారు. చిన్నపిల్లలుంటే అనుమానం రాదన్న అభిప్రాయంతో వీరిని తీసుకువెళ్తూ గంజాయితో ప్రయాణిస్తున్నారు. కాగా ఇంతవరకు పోలీస్‌లు కేసులు పెట్టిన వారిలో అత్యధిక శాతం గంజాయి రవాణాకు పాల్పడుతున్న వారే వున్నారు తప్ప గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నవారిని పట్టుకున్న దాఖలాలు లేవు. దీంతో ఒకరుతప్పితే మరొకరితో రవాణా చేయిస్తున్నారు.

వినతులు అన్నింటికి పరిష్కారం చూపాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన, న్యాయ స్థానాల పరిధిలో ఉన్న వినతులను మినహాయించి మిగిలిన వాటికి సరైన పరిష్కారం చూపాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో భాగంగా వినతులు స్వీకరించారు. ప్రజా పరిష్కార వేదికకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రతి వినతిని కూలంకుషంగా పరిశీలిస్తుందని, అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఆదేశించారు. సమాధానం పంపేముందు అర్జీదారులతో మాట్లాడాలని వారు సంతృప్తి చెందేలా సమాధానం ఉండాలన్నారు. తప్పుడు ఎండార్స్‌మెంటు వేసినా, తప్పుడు ఫోన్ నెంబర్లు ఇచ్చినా, సంబంధం లేని సమాధానాలు ఇచ్చినా చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

వేపాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలను సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులుగా లేవనెత్తడం తప్ప.. అధికారులు పరిష్కరించడం లేదని.. అలాంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకని సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తా రు. సోమవారం స్థానిక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్తున్నాయని.. దీని నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారో సభలో ప్రకటించాలని సింగరాయి, చినగుడిపాల, సోంపురం సర్పంచ్‌లు నిరుజోగి వెంకటరావు, భోజంకి రామునాయుడు ఏవోయశ్వంతరావును నిలదీశారు. దీనిపై తహసీల్దార్ రాము లమ్మ స్పందిస్తూ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, జడ్పీటీసీ అప్పారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోరాట యోధుడు పీవీరావు

గుర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల కోసం మాలమహానాడును స్థాపించి ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడు, మాలల ఆశాజ్యోతి పీవీరావు అని అని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. సోమవారం గుర్ల మండల కార్యాలయం ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహంవద్ద దివంగత పీవీరావు 19వవర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులతో అంజలి ఘటించారు. కార్యక్రమంలో రెల్లి కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు నీలాపు దేవి, మాల మహానాడు చీపురుపల్లి నియోజకవర్గం కన్వీనర్ సబ్బి సోనియా, చీపురుపల్లి, గుర్ల మండలాల మాలమహానాడు అధ్యక్షులు కక్కి భీమరాజు, దేబార్కి చంటి, కార్యదర్శి లోగిశ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బెల్లాన నారాయణరావు, దాసరి రామారావు, జి.వెంకటరావు, చోళ్ల సింహాచలం, రిక్కి అప్పారావు పాల్గొన్నారు.

బొడ్డవలసలో ఇసుక క్వారీలు వాస్తవమే

రేగిడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలసలో ఇసుక క్వారీలు వాస్తవమేనని తహసీల్దారు చిన్నారావు స్పష్టంచేశారు. దీనిపై ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో 'పర్యవేక్షణ లేక..ఇసుక దందా ఆగక' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో వీఆర్‌ఓ దుర్గారావు బొడ్డవలస నదీతీర ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. బొడ్డవలసఇవతలి ఒడ్డులో అక్రమ రవాణా లేదని.... నదికి అవతల రెండు జేసీబీలతో రక్షిత బావుల దరిలో తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఇది ఉమ్మడి జిల్లాల సరిహద్దు ప్రాంతమని... తమ పరిధి కాదని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వివరించారు.

బొబ్బిలిలో రైతు దినోత్సవం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో సోమవారం బ్రహ్మకుమారీ అక్కయ్య రాజేశ్వరి ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్నాథపురం ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు, విశ్రాంత ఏవో గోవిందరావు, ప్రకృతి వ్యవసాయ రైతులు రాఘవరావు దంపతులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.

మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకే మతాలు: మంత్రి



క్రిస్మస్ హైటీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) మానవాళిని సన్మార్గంలో నడిపించడానికే మతాలు పుట్టాయని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం విజయనగరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ హైటీ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ శాంతి, ప్రేమ కరుణలకు యేసు ప్రభువు ప్రతిరూపమన్నారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. పాస్టర్ ప్రభాకర్ క్రీస్తు సందేశాన్ని అందించారు.కార్యక్రమంలో జేసీ సేథూమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్.ఎస్ జాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగిలో క్రిస్మస్, ధనుర్మాసం పురస్కరించుకొని వనమిత్ర కె.కృష్ణదాస్ మహిళలకు దుస్తులు పంపిణీచేశారు. అనంతరం స్థానిక అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో భోజనాలుఏర్పాటుచేశారు.

●బొబ్బిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి సీబీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి బాల యేసు జనన సంబరాలను ఘనంగా నిర్వహించారు. బాలలంతా విచిత్ర వేషధారణలతో పలువురు ఆకట్టుకున్నారు. చర్చి ఫాదరు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.



బొబ్బిలి: సీబీఎం చర్చిలో వేషధారణలో బాలలు

నిర్వహణ లేక.. గోతులు పూడ్చక

● పొంచిఉన్న ప్రమాదం ● ఇదీ రాజాం - విశాఖ ప్రధాన మార్గంలో పరిస్థితి



గాయత్రీకాలనీ సమీపంలో..

రాజాం రూరల్, ఆగస్టు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):రాజాం -విశాఖ ప్రధాన మార్గంలో గాయత్రీ కాలనీ, ఇప్పిలిపేట గ్రామసమీపంలో నిర్వహణ లేకపోవడంతోపాటు గోతులు పూడ్చకపోవడం వల్ల వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలతో ఈ రెండు మార్గాలు రద్దీగా ఉంటున్నాయి. ఈ మార్గంలో రెండుచోట్ల రహదారులకు గండ్లు పడి ఏడాది గడుస్తున్నా అధికారులు కనీస మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడంపై వాహన చోదకులు, ప్రయాణికులు విమర్శిస్తున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటుచేయలేదు. గోతులకు అడ్డంగా రాళ్లు పెట్టి చేతులు దులుపుకొన్నారని పలువురు వాపోతున్నారు. ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించేవారు ఈ గోతుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే ఈ రెండు గోతులు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



ఇప్పిలిపేట సమీపంలో గొయ్యి వద్ద రాయి ఏర్పాటుచేసినదృశ్యం

లింకు రోడ్లుతోనే పల్లెల అభివృద్ధి

● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



జియ్యమ్మవలస: దంగభద్రలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్లెలు అభివృద్ధికి లింకు రోడ్లు అవసరమని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ ప్రభుత్వానికి రెండు కళ్లు అని చెప్పారు. సోమవారం కుదమ పంచాయతీలో గంగరాజపురం గదబవలస - సింగనాపురం గ్రామాల మధ్య, దంగభద్ర పంచాయతీ కేంద్రం నుంచి దంగభద్ర-గదబవలస గ్రామాల మధ్య బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు, వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్, దంగభద్ర సర్పంచ్ జోగి భుజంగరావు, ఎంపీడీవో ఎస్.రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుజ్జువాయి పంచాయతీ పరిధిలో డి.భారామణి గ్రామానికి రోడ్డుసౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి వినతిపత్రం అందించారు.

డోర్ డెలివరీ సేవలపై అవగాహన

పార్వతీపురంటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ సేవలను విస్తృతం చేద్దామని పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గా తెలిపారు. సోమవారం స్థానిక డిపో కార్యాలయ ఆవరణలో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు పార్సిల్ సంస్థలతో పోటీ పడే విధంగా ఆర్టీసీ సేవలు ఉండాలన్నారు.



మాట్లాడుతున్న దుర్గా

రైతులపై అణచివేత విధానాలు తగదు

● ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు



నిరసన తెలుపుతున్న ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు

బెలగాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం అణిచివేత విధానాలు తగదని, బాష్పవాయువు ప్రయోగాలు నిలిపివేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరించాలని, రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు బంటు దాసు, ఎం.కృష్ణమూర్తి, గేదెల సత్యన్నారాయణ, సంగం, రంజిత్ కుమార్, పి.రమణి పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి: ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి ఆదేశించారు. సోమవారం పోలీస్‌జిల్లాకార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్)కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్ఐ ఫక్రుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ వివిధ ఘటనల్లో మృతి చెందిన వారి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి సోమవారం అందజేశారు. రైలు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ మల్లీశ్వరరావు కుటుంబానికి రూ.75 వేలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.బాదర్ కుటుంబానికి రూ. లక్ష, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు కుటుంబానికి రూ.లక్ష చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ నాయుడు, ఎ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులపై జాగ్రత్తలు తీసుకోవాలి: డీఎంహెచ్‌వో



విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పద్మావతి

సీతానగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత గల విద్యార్థుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎం హెచ్‌వో డాక్టర్ కేవీఎస్ పద్మావతి సూచించారు. సోమవారం సీతానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇటీవల జారీ చేసిన రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కార్డుల వివరాలతో పాటు హిమోగ్లోబిన్ లెవెల్స్‌పై ఆరాతీశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, మెడికల్ సిబ్బంది కె.సత్యవతి, ఎస్వీ రమణ, జీవీఎస్ శర్మ, హెచ్‌ఎం ఇ.ప్రసన్నలక్ష్మి, ఎం.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

శివడవలసలో మేలుకొలుపు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివడవలసలో సోమవారం శ్రీరామలింగేశ్వర మేలుకొలుపు భజన బృందం ఆధ్వర్యంలో ధనుర్మాసం పురస్కరించుకుని మేలుకొలుపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు కిల్లన సత్యనారాయణ, శంబంగి రామారావు, పెద్దింటి నారాయణరావు, పట్నాన తవిటయ్య, యండ్రపు సత్యనారాయణ పాల్గొన్నారు.

●సాలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, పెదకోమటిపేట రామాలయాల్లో సోమవారం ధనుర్మాసం ఎనిమిదో పాశురం పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం గోదాదేవికి, కల్యాణ వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర శతనామార్చన పూజలను రుత్వికులు నారాయణాచార్యులు,ఉదయాచార్యులు చేశారు.



బొబ్బిలి రూరల్: శివడవలసలో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం: తహసీల్దార్

గరుగుబిల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలు మండల కేంద్రంలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.బాల తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.గాంధీ, వీఆర్వోలు గౌరీశంకరరావు, రాఘవతో పాటు సచివాలయ సర్వేయర్లు పి.రామ్‌మోహనరావు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ బాల

ధాన్యం కొనుగోలు వేగం పెంచాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, బియ్యం పంపించడంలో మిల్లర్లు ఆలస్యం చేయవద్దని తహసీల్దార్ ఎం.శ్రీను కోరారు. సోమవారం బొబ్బిలిలో రైస్ మిల్లుల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.బ్యాంక్ గ్యారంటీలు త్వరగా అందజేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని, అవసరమైన గన్నీ బ్యాగులు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వానికి పంపాల్సిన బియ్యంపై సమీక్షించారు. సమావేశంలో సీఎస్‌డీటీ సాయికృష్ణ, ఆర్ఐ రాంకుమార్ పాల్గొన్నారు.

వీరఘట్టంలో జ్వరాలపై సర్వే

వీరఘట్టం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం బీసీకాలనీలో సోమవారం జ్వరాలపై వైద్యసిబ్బంది సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి మోహన్‌రావు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జ్వరాలపై సర్వేనిర్వహిస్తున్న సిబ్బంది

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: ఎస్ఐ

మక్కువ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు. స్థానిక చర్చి జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట తనిఖీలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మక్కువ: వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

● భామిని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు బత్తిలి ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు. సోమవారం భామినిలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు.

గొల్లపల్లిలో భవానీల ఇరుముడి

బొబ్బిలి డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని గొల్లపల్లిలో సోమవారం భవానీల ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుభవాని కంచెర్ల భవాని ఆధ్వర్యంలో వందమందికిపైగా భవానీ భక్తులు విజయవాడ దుర్గామల్లేశ్వర అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. వారంతా భవానీ మాలాధారణకు సంబంధించిన ఇరుముడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గొల్లపల్లి నుంచి రైల్వేస్టేషన్‌వరకు భవానీలు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు పువ్వల శ్రీనివాసరావు, సాయిరమేష్, కాకలవెంకటరావు, గేదెలగోపి, కిరణ్ స్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

సీతంపేట రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నిర్వహించిన పీసా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమారరెడ్డి తెలిపారు.13గ్రామసభల్లో తొమ్మిది ఏకగ్రీవం కాగా నాలుగు చోట్ల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు చెప్పారు. కిల్లాడలో పీసా ఎన్నికల అధికారి పి.నారాయడు ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులుగా ఆరిక ఆనందరావు, కార్యదర్శిగా కూరంగి త్రినాథరావులను ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి నారాయడు ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేశారు.ఆయనతో పాటు ఉమామహేశ్వరరావు ఉన్నారు.

నేడు పీసా గ్రామసభలు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంలంలోని 26 పంచాయతీల్లో మంగళవారం జరిగే పీసా గ్రామసభలను విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి సాల్మన్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా పీసా చట్టంపై గిరిజనులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దుడ్డుకళ్లు తప్ప మిగతా షెడ్యూల్డ్ గ్రామ పంచాయతీలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డీలర్ పోస్టుకు రాత పరీక్ష

పాలకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చౌక ధరల దుకాణం డీలరు ఉద్యోగానికి రాత పరీక్ష సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షలను సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. డివిజన్ పరిధిలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను మేరకు ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణం డీలర్ కోసం ఈ పరీక్ష నిర్వహించారు.

స్కూల్ కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోనినారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పునరుద్ధరించాలని యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఎస్.రమేష్ కోరారు.ఈ మేరకు సోమవారం పేరెంట్ కమిటీ సభ్యులు ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు, యూటీఎఫ్ నాయకులు పీబీఎస్ మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

రామభద్రపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించాలని అగ్నిమాపకశాఖ అధికారి ఈర్ల రామసూర్యారావు తెలిపారు. రామభద్రపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పవర్ సిస్టం పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించండి

పాలకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని నాయీ బ్రాహ్మణులు కోరారు.ఈ మేరకు టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, పార్టీ పట్టణాధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ నాయకులు బర్లి సుధ పాల్గొన్నారు.

మ్యుటేషన్ల అర్జీలను ఆన్‌లైన్ చేయండి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మ్యుటేషన్‌కు సంబంధించిన అర్జీలను త్వరలో ఆన్‌లైన్ చేయాలని అధికారులను తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం మండలంలోని సీహెచ్ బొడ్డవలసలో రెవెన్యూసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా రెవెన్యూసదస్సుల్లో తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సదస్సులు వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా 15 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ శివున్నాయుడు, సర్వేయర్ సతీష్ పాల్గొన్నారు.